
సాక్షి విజయనగరం

బుధవారం । 25 । జనవరి । 2023



సంగాంలో రుద్రాభిషేకం

వంగర: సంగాం గ్రామంలో వెలసిన సంగమేశ్వ రస్వామి ఆలయంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు రుద్రాభిషేకం చేశారు. ప్రధాన అర్చకుడు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు.



తాళి కట్టు శుభవేళ..!

పెళ్లీడుకొచ్చిన యువత ఎదురు చూసే మాఘ మాసం వచ్చేసింది. శుభ ముహూర్తాలను తీసుకువచ్చింది.

- 8లో



వెంకన్నకు భానుడి కిరణ స్పర్శ

దత్తిరాజేరు: దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారిని మంగళవారం ఉదయం సూర్యకిరణాలు స్పర్శించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని భక్తులు తిలకించగా, అర్చకుడు హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష



చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

డెంకాడ: జేఈఈ మెయిన్స్ పరీక్ష చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళ వారం ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో జరిగింది. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షకు 224 మందికి 222 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 224 మందికి 223 మంది హాజరయ్యారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎస్ రాజు హాజరవుతారన్నారు. యువ ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులను అందజేస్తామని తెలిపారు.

మామిడిపల్లి బీఎల్ఓకు రాష్ట్రస్థాయి పురస్కారం



శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలో మామిడిపల్లి గ్రామ బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరావు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బీఎల్ఓగా ఎంపికై నట్టు ఎస్.కోట తహసీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటారన్నారు.

రూ.701.7 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

- 1,99,387 ఇళ్లకు కుళాయికనెక్షన్లు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్



బొబ్బిలి రూరల్: జలజీవన్ మిషన్ పథకం కింద జిల్లాలో రెండో విడతలో రూ.701.7 కోట్ల వ్యయంతో 1300 పనులు చేపడుతున్నామని, 1,99,387 ఇళ్లకు కుళాయికనెక్షన్లు వేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ తెలిపారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి అన్ని పనులకు టెండర్లు పిలిచి అప్పగిస్తామని చెప్పారు. 653 ట్యాంకుల నిర్మాణం, 1164 నీటి వనరుల అభివృద్ధి, 2,314 కిలో మీటర్లమేర ఇంటింటికీ పైపులైన్ల ఏర్పాటు, 750 కిలోమీటర్ల మేర ట్యాంకుల నుంచి పైపులైన్లు వేస్తామన్నారు. తొలివిడతలో రూ.160.81 కోట్ల వ్యయంతో 1,111 పనులు చేపట్టగా, 646 పనులు పూర్తయ్యాయని చెప్పారు. రూ.11 కోట్ల బకాయిలు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. కమ్యూనిటీ మరుగుదొడ్లు 530 మంజూరుకాగా, 329 పూర్తయ్యాయని చెప్పారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి
- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీను ప్రారంభిస్తున్న కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం అమల్లోకి వస్తుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధంపై నిర్వహించిన అవగాహనా ర్యాలీను విజయనగరం ఎత్తుబ్రిడ్జి వద్ద మంగళ వారం కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తజన శంబరం



- కొండగుడిలో వైభవంగా సాగిన పోలమాంబ సిరిమాను సంబరం
- తిలకించిన రెండు లక్షలమంది భక్తులు
- అధికారుల కృషితో సాఫీగా సాగిన సిరిమాను తిరువీధి
- భక్తుల జయజయ ధ్వానాలు
- అమ్మవారి ఆశీస్సులు అందించిన సిరిమాను పూజారి



శంబరలో సిరిమానోత్సవ సందడి (ఇన్‌సెట్లో) సిరిమానును అధిరోహించిన పూజారి రామారావు

మక్కువ: మంగళ వాయిద్యాలు.. భక్తుల జయజయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగా వైభవంగా సాగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో శంబర గ్రామం భక్త సంద్రంగా మారింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు తరలివచ్చిన వేళ భక్త జనం పులకించింది. అమ్మవారికి మనసారా ప్రార్థనలు చేసింది. మొక్కుబడులు చెల్లించింది. అమ్మవారి ఆశీర్వాదం అందుకుంది.

దారులన్నీ శంబర వైపే...

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దారులన్నీ శంబర వైపే సాగాయి. శంబర సమీప గ్రామాల ప్రజలకు కాలినడకన చేరుకోగా, దూర ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, బైక్‌లు, సొంత కార్లపై చేరుకున్నారు. గోముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆరాధ్య దైవం పోలమాంబను దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చీరలు, కోళ్లు, పొట్టేళ్లు చూపించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం రెండున్నర నుంచి మూడు గంటల మధ్యలో సిరిమానోత్సవాన్ని ప్రారంభించాలని అధికారులు భావించినా... అనుకున్న సమయానికి సిరిమానోత్సవాన్ని ప్రారంభించలేకపోయారు. ఘటాలను తీసుకురావడం, అమ్మవారికి మొక్కుబడిగా చూపించే మేకపోతును తేవడంలో కాస్త ఆలస్యం కావడంతో మధ్యాహ్నం 3.49 గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు. దీంతో ఏటా నిర్వహించిన సమయంకన్నా కాస్త ఆలస్యంగా సిరిమానుతిరువీధి ప్రారంభమైంది. అంతకు ముందు జన్నివారి ఇంటి నుంచి ఘటాలను అమ్మవారి ఆలయంలోకి



చదురుగుడి నుంచి తీసుకువస్తున్న అమ్మవారి ఘటాలు

తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం సిరిమాను ఉండే ప్రదేశానికి తీసుకెళ్లారు. ప్రధాన ఆలయం నుంచి అమ్మవారు వచ్చే మార్గంలో నేలపై పలువురు భక్తులు చీరలను పరిచి చిన్నారులను ఉంచి అమ్మవారి ఘటాలను దాటించారు. జన్నివారి ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను గిరడ వారింటికి, ఆ తరువాత మునసబు, కరణం ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేశారు. అక్కడ నుంచి పనుకువీధి, గొల్లవీధి, జన్నివీధుల మీదుగా సిరిమాను తిరువీధి సాగి చివరకు ప్రధానాలయం వద్దకు చేరుకుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తుల తాకిడి ఉదయం 11.30 గంటల నుంచి ప్రారంభమైంది. సిరిమానోత్సవ సమయానికి లక్షలాది మంది భక్తుల రాకతో శంబర గ్రామం కిటకిటలాడింది. వీధులన్నీ జనంతో నిండిపోయాయి. గ్రామంలోని మేడలపై నుంచి అమ్మవారిని కనులారా వీక్షించారు.

అమ్మవారి సేవలో డిప్యూటీ సీఎం

శంబర పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర దర్శించుకున్నారు. ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.





తల్లి తోడుతో జాతరకు వచ్చిన దివ్యాంగురాలు

ఫలించిన అధికారుల కృషి...

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి క్యూలైన్లు ఏర్పాటు, బస్సుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు పక్కాగా అమలు చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఉదయం 11.30 గంటల తర్వాత అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు సరిపడకపోవడంతో ఎండలోనే నిల్చొన్నారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు భక్తులకు తాగునీటిని అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీఓ హేమలత, దేవదాయశాఖ ఉపకమిషనర్ ఎన్.సుజాత, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, డీఎస్పీలు జగదీశ్వరరావు, సుబాష్, నళిని ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యూ లైన్లకు సమీపంలో తలనీలాలు సమర్పించేందుకు, అక్కడకు సమీపంలోనే

సిరిమానోత్సవం సాగిందిలా..

- మధ్యాహ్నం: జన్నివారి ఇంటి నుంచి చదురుగుడికి చేరుకున్న అమ్మవారి ఘటాలు
- అమ్మవారి ఆలయం నుంచి సిరిమాను ప్రదేశానికి బయల్దేరిన ఘటాలు
- ఆలయం నుంచి పూజారి రామారావును భక్తులు భుజాలపై ఎత్తుకుని సిరిమాను తిరిగే ప్రదేశానికి తీసుకువచ్చారు.
- సిరిమానోత్సవం ప్రారంభమైంది.
- తిరిగి ముగిసింది.

సైడ్ లైట్స్

- భక్తుల రద్దీ దృష్ట్యా చదురుగుడిలో అన్నదాన విరాళాలు సేకరించవద్దని పోలీసులు చెప్పడంతో దేవదాయశాఖ అధికారులు గుసగుసలాడారు.
- చదురుగుడి క్యూ కాంప్లెక్స్ వద్ద సప్తస్వరాలయం స్కూల్‌ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- సత్యసాయిసేవాసమితి సభ్యులు భక్తులకు మంచినీటిని అందించారు.
- గజపతినగరం మండలం పారిశుద్ధ్య కార్మికురాలు సొమ్మసిల్లి పడిపోవడంతో 108లో శంబర పీహెచ్‌సీకి తరలించారు.
- రెండు డ్రోన్ కెమెరాలతో జాతరను పోలీసులు పర్యవేక్షించారు.

భక్తులకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు

భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఈ ఏడాది ఆర్టీసీ ఉత్తమ సేవలు అందించింది. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి మంగళవారం సుమారు 150 బస్సులను నడిపింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, వెళ్లే భక్తులకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కొందరు భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారి ఆలయ పరిసరాల్లోని తోటల్లో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.

కోళ్లు, గొర్రెలు మొక్కులు తీర్చుకొనే ఏర్పాట్లు చేయడం భక్తులకు సమయం కలిసొచ్చింది.

పోలీసుల పర్యవేక్షణ భేష్..

అమ్మవారి జాతరలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది రాకూడదని ఈ ఏడాది భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. రోప్ పార్టీ, స్పెషల్ పార్టీ, క్రైమ్ పార్టీలు ఎవరికి వారిగా విధులు కేటాయించారు. రెండు డ్రోన్ కెమెరాలతో పాటు, 37 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సిరిమాను వద్ద రోప్ పార్టీ భక్తుల తోపులాటలు జరగకుండా నివారించింది. సిరిమాను తిరిగే అన్ని వీధుల్లోనూ ఏఎస్పీ పర్యవేక్షించారు. ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, డీఎస్పీలు జగదీశ్వరరావు, సుభాష్, నళిని, సాలూరు సీఐ ధనంజయరావు జాతర సాఫీగా సాగేందుకు కృషిచేశారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వంటా వార్పు చేస్తున్న మహిళలు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ వెంకటరమణ



జాతరలో సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా

73 లక్షల మంది గిరిజనులకు లబ్ధి

- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే గిరిజనాభివృద్ధి
- సబ్ ప్లాన్‌పై అవగాహన లేకుండా జనసేన చర్చించేదేముంది..?
- ఎస్టీ సబ్ ప్లాన్‌ను పొడిగించడమే దానికి నిదర్శనం
- డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర



సాక్షి ప్రతినిధి విజయనగరం:

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలతో రాష్ట్రంలోని 73లక్షల మంది గిరిజనులకు లబ్ధిచేకూరిందని, గిరిజనాభివృద్ధికి గట్టి పునాది పడిందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర స్పష్టం చేశారు. గత మూడున్నరేళ్లల్లో గిరిజనుల సంక్షేమం కోసం రూ. 16వేల కోట్లు ఖర్చు చేయడం, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్ల పాటు పొడిగించడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సాలూరులో ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఎస్టీ సబ్ ప్లాన్‌పై అవగాహన లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్‌ప్లాన్‌ను అమలు చేయకుండా ఎస్సీ కాంపోనెంట్‌గా విడదీశారన్న విషయం తెలుసుకోవాలన్నారు. అలా ఇచ్చిన ట్రైకార్ రుణాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో మధ్యవర్తులు, జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అమలుచేయడంతో అవినీతి జరిగిందన్నారు. ఇవేవి తెలుసుకోకుండా సబ్ ప్లాన్‌పై పవన్ కల్యాణ్ చర్చిస్తామనడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ, పచ్చమీడియా మాయలోపడిన జనసైనికులు... వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు జరిగిన మేలును మర్చిపోవడం తగదన్నారు. అభిమానులుగా పవన్‌కల్యాణ్ సీఎం కావాలని జనసైనికులు కోరుకోవాలే తప్ప చంద్రబాబుకాళ్ల దగ్గర ఉంటామని కోరుకోకూడదన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం నవరత్నాల్లో అమలుచేస్తున్న 'పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి స్కీమ్‌లతో గిరిజనులకు అధిక మేలు కలుగుతోందన్నారు. టీడీపీ హయాంలో సాలూరు నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 11 రోడ్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతులకు గురైన, అర్ధాంతరంగా పనులు ఆగిపోయిన 149 రోడ్లను బాగుచేసేందుకు రూ.60 కోట్ల నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంపై రాజన్నదొర హర్షం వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.960 కోట్ల మేర ధాన్యం బకాయిలు పెట్టిందని ప్రస్తావించారు. వాటన్నింటినీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రైతులకు చెల్లించిందన్నారు.

అందరిపైనా పోలమాంబ చల్లని దీవెనలు..

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గిరిజనదేవత చల్లని దీవెనలు అందరికీ అందుతాయని, ఆ తల్లి దయవల్లే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా, గిరిజనశాఖమంత్రిగా ఉన్నానని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. రాష్ట్రంలో పాడేరు మోదలమ్మ తల్లి పండగ మూడు వారాలు జరగగా, శంబరపోలమాంబ అమ్మవారి పండగ 10 వారాలు పాటు జరుగుతుందన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించారన్నారు. అమ్మవారి సంప్రదాయాలను కొనసాగించాలని, ఉద్యోగాలకు పోరాదన్నారు. సిరిమానోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. సిరిమాను పూర్తయ్యేవరకు బాధ్యత వహించాలని సూచించారు.

ఆడ పిల్లల చదువుతో సమాజాభివృద్ధి

- టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



గురవాం కేజీబీవీలో మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

రాజాం: ఆడపిల్లల చదువుతో సమాజాభివృద్ధి జరుగుతుందని, వారిని ఉన్నత చదువులు చదివించాలని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాజాం మండలం గురవాం కేజీబీవీలో మంగళవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు కేజీబీవీలలో ఆడపిల్లలను చదివించేందుకు వెనుకాడే తల్లిదండ్రులు, ఇప్పుడే అదే పాఠశాలల్లో ఇంటర్ వరకూ చదివించేందుకు పోటీపడుతున్నారన్నారు. కొన్ని విద్యాలయాల్లో సీట్లు కూడా దొరకడంలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో రాష్ట్రంలోని 350 కస్తూర్బా విద్యాలయాలు కార్పొరేట్ తరహా స్కూల్స్‌వలే దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన సాగుతోందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలు ఆడపిల్లల చదువుకు చేదోడుగా నిలిచాయని, దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. చదువులో రాణిస్తున్న బాలికలను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్‌ఛైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ వీఏ స్వామినాయుడు, పాఠశాల ఎస్ఓ గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

15లోగా డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎడ్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ఏప్రిల్/మే నెలల్లో జరుగుతాయని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 2015–17 నుంచి 2018–20 విద్యా సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరుకావాలన్నారు. అపరాధ రుసుములేకుండా ఈనెల 15లోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధరుసుముతో ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు నాలుగు సబ్జెక్టులకు రూ.150, మూడింటికి రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలాపాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్

మెంటాడ: మండలంలోని ఉద్దంగి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఫిరోజ్‌ను విధుల్లో అలసత్వం వహిస్తున్న కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీడీఓ తివిక్రమ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కేఎల్‌వలస పంచాయతీ పరిధిలోని కొన్ని గ్రామాల్లో హౌసింగ్ బిల్లుల మంజూరుకు ఆ గ్రామాలకు వెళ్లకుండా విధుల్లో అలసత్వం వహించినందుకు గాను చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అలాగే మండలంలో కొంతమంది సచివాలయ సిబ్బందిపై ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బంది విషయాన్ని కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు.

వైద్యారోగ్యశాఖలో మిగులు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఎస్ఎన్‌సీయూ, ఆర్‌కేఎస్‌కేల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌సీయూలో సెక్యూరిటీ గార్డుపోస్టు-1ఎస్టీ (మేల్) ఎక్స్ సర్వీస్‌మన్, సైక్రియాటిక్ సోషల్‌వర్కర్ పోస్టు-1 (ఎస్సీ మహిళ),ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ పోస్టు-1 (ఎస్సీ మహిళ)కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 25 వతేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి 13 జట్లు, బాలికల విభాగం నుంచి 13 జట్లు పాల్గొంటున్నాయి. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విజయనగరం-కృష్ణా జిల్లాల జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 61-25 పాయింట్ల తేడాతో విజయనగరం జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 32-15 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం బాలికల జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరింది. అలాగే బాలుర విభాగంలో విశాఖపట్నం-చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 44-18 పాయింట్ల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు జట్ల నడుమ జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 50-19 శ్రీకాకుళం బాలుర జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో మిగతా జట్ల మధ్య పోటీలు సాగాయి. సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న ఎనిమిది బాల, బాలికల జట్లకు బుధవారం ఉదయం 9గంటల నుంచి పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పోటీలను పర్యవేక్షించారు.

తాళి కట్టు శుభవేళ..!

- మాఘమాసం ప్రారంభంతో శుభకార్యాల సందడి
- మార్చి వరకు కొనసాగనున్న మంచి ముహూర్తాలు
- వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సిద్ధమవుతున్న జిల్లా ప్రజలు
- అన్ని రంగాల ప్రజలకు ఉపాధి

మంచి మూహూర్తాలు ఇవే:
జనవరి : 25,26, 27,28
ఫిబ్రవరి : 1, 8, 9,10,11,12,15, 16,22, 23, 24, 25
మార్చి : 1, 5, 8, 9,10,11,14, 15, 17, 18, 22, 23, 24, 26
ఏప్రిల్: గురుమూఢమి. ముహూర్తాలు లేవు.



పెళ్లి తంతు దృశ్యం

విజయనగరం: పెళ్లీడుకొచ్చిన యువత ఎదురు చూసే మాఘమాసం వచ్చేసింది. శుభ ముహూర్తాలను తీసుకువచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శుభ కార్యాలను నిర్వహించుకోవడంలో ముహూర్తాలు లెక్కకట్టడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి మాఘమాసంలో మంచి రోజులు ప్రారంభం కావడంతో రానున్న రెండు నెలలు పల్లె, పట్టణం తేడా లేకుండా సందడి వాతావరణం నెలకొంటుంది. శుభకృత్ నామ సంవత్సరంలో చివరి ముహూర్తం మార్చి నెలలో ముగియనుండగా.. ఉగాది అనంతరం మళ్లీ శుభ కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి.

రెండు నెలలు సందడే సందడి

పెళ్లి వయస్సుకు వచ్చిన యువత ఎదురు చూసే మాఘమాసం ప్రారంభం కావడంతో జిల్లాలో బాజాభజంత్రీల మోత మోగనుంది. ఆకాశమంత పందిరి, భూదేవంత పీట వేసి వివాహవేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా గృహప్రవేశాలు చేసేందుకు, నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టేందుకు.. నిశ్చితార్థ మహోత్సవాలు నిర్వహించుకునే వారు అయా పనుల్లో ఇప్పటికే నిమగ్నమయ్యారు. ప్రధానంగా వివాహ వేడుకలకు సంబంధించి కల్యాణ మంటపాలకు డిమాండ్ పెరగడంతో వాటిని ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా గిరాకీ లేక వెలవెలబోయిన కల్యాణ మంటపాలకు ప్రస్తుతం డిమాండ్ బాగా ఏర్పడింది.



శుభ కార్యాల్లో వినియోగించే విద్యుత్ వెలుగులు

కళకళ లాడుతున్న మార్కెట్:

శుభ కార్యాల సందడి ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల్లోని ప్రధాన మార్కెట్‌లు కళకళ లాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, చీపురుపల్లి, ఎస్ కోట వంటి ప్రధాన పట్టణాల్లో వస్త్ర వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకే తలమానికంగా నిలిచిన విజయనగరంలోని బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ సందడిగా మారింది. అంతేకాకుండా పెళ్లితంతులో కీలకమైన బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు వచ్చే వారితో విజయనగరం జిల్లా కేంద్రం కళకళ లాడుతోంది.

అన్ని రంగాల ప్రజలకు ఉపాధి

పెళ్లిళ్ల సీజన్‌పై ఆధారపడే పురోహితులు, వంట మేస్త్రీలు, రవాణా, అలంకరణ, బాజాభజంత్రీలు, ఆహ్వాన పత్రికల ముద్రణ, బ్యూటీషియన్లు, క్యాటరింగ్, షామియానాలు, పూలు, పండ్ల వ్యాపారులు, బట్టల దుకాణాలు, నగల షాపులు, దర్జీలు, ఐస్‌క్రీం పార్లర్లు, కూరగాయలు, జనరేటర్ సరఫరాదారులు, లైటింగ్ ఏర్పాట్లు చేసేవారు ఇలా వివిధ రంగాల వారికి రానున్న రెండు నెలలూ చేతి నిండా పని దొరకనుంది.

మంచి ముహూర్తాలు ప్రారంభం



మాఘమాసం ఆదివారం ప్రారంభమైంది. మార్చి మూడవ వారం వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు నెలలు జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు, శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు నిర్వహించనున్నారు. అంతేకాకుండా ఈ మాసంలో సూర్యభగవానుడిని ఆరాధిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

– కామేశ్వరశర్మ, వేదపండితుడు

బాలికను రక్షిద్దాం..చదివిద్దాం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరం అర్బన్: బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం అనే నినాదంతో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సూర్యకుమారి, ఎమ్మెల్సీ రఘువర్మ, బాలల హక్కుల రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు, మేయర్ విజయలక్ష్మి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమ బిందు తదితరులు వారి సందేశాలను అందించారు. బాలికల పుట్టుకను ప్రేమ, వాత్సల్యంతో స్వాగతించాలని వారి హక్కుల కల్పనకు పురోభివృద్ధికి పాటు పడవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలకు జీవితం సెటిల్ అవ్వడం అంటే పెళ్లి మాత్రమేనని భావించకూడదని మంచి చదువు, మంచి ఆలోచన, తెలివి తేటలు ఉండాలని అభిప్రాయ పడ్డారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, మంచి ఆహారాన్ని తిని ఆరోగ్యంగా బలంగా ఆత్మ స్థైర్యంతో ఉండాలని సూచించారు. సఖి సమావేశాల్లో పలు అంశాలు చర్చిస్తున్నారని, అమ్మాయిలకు ఉపయోగ పడే అనేక అంశాలు అవగతం చేసుకోవచ్చని సమావేశాలకు బాలికలు, మహిళలు తప్పక హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ఆడ పిల్లలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో తిరగడంలో పురుషుల సహకారం అవసరమన్నారు. బాలల హక్కు చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ స్త్రీ ఒకప్పటి కంటే ప్రస్తుతం చైతన్యం చెంది ఉందన్నారు. అన్ని రంగాల్లో పురుషులతోపాటు స్త్రీలు అభివృద్ధి చెందుతూ పురుషులకే సవాల్ విసురుతున్నారన్నారు. టీనేజ్ బాలికలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తమ లక్ష్యాలను సాధించే వరకు కష్టపడి చదువుకోవాలని హితవు పలికారు.

ఆకట్టుకున్న పుత్తడి బొమ్మ పూర్ణమ్మ ప్రదర్శన

ఈ సందర్భంగా విద్యార్థినులు బాలికల స్వయం రక్షణకు చేపట్టవలసిన అంశాలపై ప్రదర్శించిన పలు స్కిట్లు, నాటికలు సందేశాత్మకంగా నిలిచాయి. ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్, బాడ్ టచ్‌లు ఎలా ఉంటాయనే అంశాలను, ఎలా తనను తాను రక్షించుకోవాలనే అంశాలపై లఘు నాటికలు ప్రదర్శించారు. మహాకవి గురుజాడ రచన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ బుర్రకథ రూపంలో ప్రదర్శిస్తూ చిన్నారులు అభినయించిన తీరు ఆకట్టుకుంది. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతకుమారి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రమణకుమారి, జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

అస్సాంపై ఆంధ్రా పైచేయి

- మొదటి ఇన్నింగ్స్‌లో రాణించిన అభిషేక్, హనుమవిహారి



80 పరుగులు చేసిన ఆంధ్రా కెప్టెన్ హనుమ విహారి



ఆంధ్రా- అస్సాం జట్ల జరుగుతున్న రంజీ మ్యాచ్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఆతిథ్య ఆంధ్ర జట్టు మొదటిరోజు సత్తా చాటింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆంధ్ర-అస్సాం జట్ల మధ్య రంజీ మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. టెస్ట్‌మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అస్సాం జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి 37.5 ఓవర్లలో 113 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆంధ్ర బౌలింగ్ లో రాయుడు 12 పరుగులిచ్చి 4 వికెట్లు, కేవీ శశికాంత్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు చేజిక్కించుకుని అస్సాం బ్యాట్స్‌మన్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 47 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 160 పరుగులు జోడించింది. బ్యాటింగ్‌లో ఆంధ్రా కెప్టెన్ హనుమ విహారి 123 బంతుల్లో 80, బ్యాట్స్‌మన్ అభిషేక్ రెడ్డి 129 బంతుల్లో 75 పరుగులతో రాణించారు.

బస్సు నుంచి జారి పడి ఒకరి మృతి

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కదులుతున్న విజయనగరం బస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి బస్ వెనుక టైర్ కిందపడి విజయనగరానికి చెందిన మైచర్ల శ్రీనివాసరావు(47) అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్సై జె.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం పట్టణంలోని అగ్రహారం బీసీ కాలనీకి చెందిన మైచర్ల శ్రీనివాసరావు సోమవారం అనకాపల్లి జిల్లా యలమంచిలిలోని తన అక్క ఇంటికి నల్లమారమ్మ తల్లి పండగకు వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయాన్నే యలమంచిలి నుంచి విజయనగరం వెళ్లేందుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చాడు. అనకాపల్లి నుంచి విజయనగరం వెళ్తున్న బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలు జారి బస్సు టైరు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనపై శ్రీనివాసరావు భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతునికి డిగ్రీ చదువుతున్న కుమార్తె ఉంది.

27న బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనే బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ కృష్ణ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నెల్లిమర్ల మండలం కొండకరకాం గ్రామంలో గల వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల ఇండోర్ బాక్సింగ్ హాల్‌లో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2004 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి, ఇంటర్, 10,9వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబులెన్స్ ఢీకొని వృద్ధుడి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక జేఎన్‌టీయూ జంక్షన్ సమీపంలో అంబులెన్స్ ఢీకొని కొండకరకాం గ్రామానికి చెందిన పతివాడ నారాయణ రావు (71) మంగళవారం మృతి చెందాడు. వృద్ధుడు నారాయణ రావు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో అటుగా వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే అదే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


నూతన ఆవిష్కరణల వేదిక స్టెప్‌కాన్

- జేఎన్‌టీయూ జీవీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు



వాటర్ ఫిల్లింగ్ సిస్టమ్ ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు





స్టెప్‌కాన్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) సదస్సులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజాం సిటీ: విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలకు వేదికగా స్టెప్‌కాన్ ఉపయోగపడుతుందని జేఎన్‌టీయూ జీవీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్ -2023ను ఆయన ప్రారంభించి సీడీ, సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యమైన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, చురుకుదనం అభివృద్ధి పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ ఇష్టాలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకుని సాధించే ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు. స్టెప్‌కాన్ లాంటి కార్యక్రమాల ద్వారా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ఇటువంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని పిలుపునిచ్చారు. డిజిటలైజ్డ్ భవిష్యత్తు కోసం విద్యార్థులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఇటువంటి సదస్సులలో ఒకరి నుంచి మరొకరు విజ్ఞానాన్ని పంచుకునేందుకు అవకాశం ఉంటుందని, అటువంటి అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ ఎల్ఎం లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి ఫెస్ట్‌లలో గెలుపోటములకు ప్రాముఖ్యత ఇవ్వకుండా పాల్గొనేందుకు ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికతతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇదొక చక్కని వేదిక అని అన్నారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి 3వేల మంది విద్యార్థులు పాల్గొని తాము తయారుచేసిన ప్రాజెక్టులను వివరించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

స్టెప్‌కాన్-2023లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసి ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను, ఆలోచనలను గుర్తించడమే కాకుండా కార్యరూపం దాల్చేందుకు ప్రదర్శనలు తోడ్పడ్డాయి. కార్యక్రమంలో సుమారు 40 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో ఐఓటీని (హైడ్రోఫోనిక్ ప్లాంట్స్) ఉపయోగించి, వాటర్ ఫిల్లింగ్ సిస్టమ్, స్మార్ట్ క్లాస్ రూమ్ డిజైన్ తదితర సాంకేతిక ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

31న మినీ జాబ్‌మేళా



జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురంటౌన్: ఈనెల 31న పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేయభేరి ఆటో మొబైల్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెంటోర్స్, టెక్నీషియన్ పోస్టులకు ఇంటర్మీడియెట్, ఐటీఐ డీజిల్ మెకానిక్, ఆటోమొబైల్స్‌లో డిగ్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. పార్వతీపురం, బొబ్బిలి, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18నుంచి 25సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు హాజరు కావచ్చని సూచించారు. అపోలో ఫార్మసీ కంపెనీలో ఫార్మసిస్టు, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలకు ఫార్మసీ సర్టిఫికెట్ పొందిన వారు, పదోతర గతి ఉత్తీర్ణులైన వారు అర్హులని స్పష్టం చేశారు. ఈ ఉద్యోగాలు విశాఖపట్నం, విజయనగరంలలో కల్పిస్తామని, ఈ పోస్టులకు వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9494777553, 6303493720 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సెంచూరియన్‌తో గబాన్ ప్రభుత్వం ఒప్పందం



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ, గబాన్ ప్రభుత్వం ప్రతినిధులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ ఆఫ్రికా దేశంలోని గబాన్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు వర్సిటీ మెయిన్ క్యాంపస్ బోర్డు రూములో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఏవోఎం గ్లోబల్ దక్షిణాఫ్రికా, రాజేష్ పారిక్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం గబాన్‌లో సెజ్‌లోని 500 హెక్టార్లలో ఐదేళ్లపాటు ప్లాంటేషన్, పండ్ల తోటల పెంపకం, రాగులు, మొక్కజొన్న, అల్లం, మిరియాలు పండించడమే కాకుండా, కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలు, శాటిలైట్ సిస్టం నిర్మిస్తామని వెల్లడించారు. గబాన్ దేశంలో రానున్న రోజుల్లో మెరైన్ ఇంజినీరింగ్, స్కిల్ డవలప్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్ రంగాల్లో సెంచూరియన్ వర్సిటీ సేవలను విస్తరించనున్నట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు పేర్కొన్నారు. గతేడాది ఫిబ్రవరిలో పీఎం నరేంద్రమోదీ ఆఫ్రికాలో మొరాకో, గబాన్‌లో పర్యటించారు. అలాగే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇతర ప్రతినిధులు ప్రైవేటు వర్సిటీలు సందర్శించిన సమయంలో ఇండియా-ఆఫ్రికా దేశాల ఒప్పందం జరిగింది. ఆ మేరకు ఒడిశా రాష్ట్రంలోని సెంచూరియన్ వర్సిటీ మెయిన్ క్యాంపస్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో గబాన్ విదేశాంగ రాయబారి సందర్శించనున్నట్టు ఆచార్య డి.ఎన్.రావు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం వంద మిలియన్ల పెట్టుబడులు సెంచూరియన్ మ్యానేజ్‌మెంట్ ఆఫ్రికా దేశంలోని గబాన్‌లో పెట్టనున్నట్టు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడి ఎం.ఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ స్కూల్‌కి చెందిన ఉత్తమ విద్యార్థులు, 5గురు ఫ్యాకల్టీని గబాన్‌కు పంపించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సీఈవో అమిత్ దుల్హానీ, సెంచూరియన్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుప్రియా పట్నాయక్, వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, వ్యవసాయ విద్యాలయం డీన్ డా.ఎస్.పి.నందా, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో 'విజయ' దుందుభి

విజయనగరం: రాష్ట్రస్థాయి ఆహ్వానపు కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. ఇటీవల విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం లాల్‌గూడ గ్రామంలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో 8 జట్లు పోటీపడగా..విజయనగరం జిల్లా జట్టు అద్భుతమైన ఆట తీరు ఆట కనబరిచి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు రూ.40వేల నగదు బహుమతి దక్కించుకుంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అభినందించింది



ఆహ్వానపు కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న జిల్లా బాలికల జట్టు